



పోస్టమన్ ఇచ్చిన కవరు అందుకుని, కవరుమీద ఫ్రమ్ అడ్రస్ చదివింది. నెలక్రితం తనని ఇంటర్వ్యూ చేసిన కంపెనీనుంచి వచ్చింది ఆ ఉత్తరం. ఆత్రంగా కవరు చించింది శైలజ. ఆ ఉత్తరం కోసమే నెల రోజులనుంచి ఎదురుచూస్తూంది, ఆశతో.

మల్లెపువ్వులా, తెల్లగావున్న లెటర్ హెడ్ మీద నీట్ గా ఇంగ్లీషులో టైప్ చేసి ఉంది ఉత్తరం. శైలజని సెలెక్ట్ చేసుకున్నామని తెలియజేయ డానికి సంతోషిస్తున్నామని, ఆ ఉత్తరంతోపాటు అపాయింట్ మెంట్ ఆర్డర్ జతపరుస్తున్నామని వ్రాసారు. ఆర్డర్ చూడగానే ఎగిరి గంతేయాలన్నంత ఆనందం కలిగింది శైలజకు.

అయిదురోజుల తరువాత వెళ్ళి చేరింది, ఆఫీసులో. ఆఫీస్ బాయ్ అటెండెన్స్ రిజిస్టర్ తీసుకువచ్చి "రోజూ ఆఫీసుకురాగానే దీనిలో సంతకం చెయ్యాలి మీరు." అన్నాడు, మొదటిరోజు. చిన్నగా నవ్వుకుంది శైలజ. కాలేజీలో నంబర్ పిలిస్తే ప్రెజెంట్ పలకాలి. ఇక్కడ సంతకం చేయాలి. కాలేజీకి, ఆఫీసుకి ఎంత తేడా!

ఆఫీస్ మేనేజర్ పేరు జస్వంత్. సింధీ అతను. నలభై ఏళ్ళలోపే ఉంటాయి. సన్నగా, తెల్లగా ఉంటాడు. తల ముందుభాగమంతా బట్టతల. ఇంగ్లీషు కూడా హిందీలాగా తమాషాగా మాట్లాడతాడు. శైలజకి కొత్తండా

ఆఫీసులో ఇద్దరు ఆంగ్లో- ఇండియన్ స్టెనోలు, ఏడు మంది క్లర్క్‌లు పనిచేస్తున్నారు. అంతా ఆడవాళ్ళే.

"మీరు మేనేజర్ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. అట్టేమంచివాడు కాదు?" చెప్పాడు ఆఫీస్ బాయ్, లంచ్ అవర్‌లో.

"ఏం?" అడిగింది శైలజ.

"ఆయన కింద అమ్మాయిలు ఎక్కువకాలం పని చెయ్యలేరు."

"ఎందుకు?"

"తాగుతాడు. అమ్మాయిలకోసం డబ్బు ఖర్చుచేస్తాడు. పరమ చండాలుడు."

"ఏజంగా? ! పైకి మంచివాడులాగానే కవబడతాడే?" అన్నది శైలజ ఆశ్చర్యంగా.

"అవును. మొదట మంచివాడులాగానే ఉంటాడు. తరువాత మొదలు పెడతాడు."

"మరి డైరెక్టర్‌కి రిపోర్టు ఇవ్వలేదా ఎవరూ?" అడిగింది శైలజ.

"ఎవరికుందా ధైర్యం? డైరెక్టర్‌కి దగ్గర బంధువు ఇతను"అన్నాడు ఆఫీస్ బాయ్.

మొదటివారం రోజులూ చాలా సరదాగా, హుషారుగా గడిచాయి శైలజకి. కాగితాలు టైప్ చేస్తూంటే కాలం తెలియకుండానే గడిచిపోయేది. కాలేజీలో చదివే రోజుల్లోలాగా కాకుండా, పని ముగించుకుని సాయంత్రం అలిసిపోయి ఇంటికివెళ్ళి, పడకకుర్చీలో పడుకుని విశ్రాంతి తీసుకుంటూంటే తృప్తిగా ఫీలయ్యేది శైలజ. చదువుకునే రోజుల్లో లేని తృప్తి.

పదిహేను రోజులు గడిచేసరికి క్రమంగా పనిమీద ఉత్సాహం తగ్గిపోసాగింది. రోజుకి ఆరుగంటలు టైప్ చెయ్యడం అలవాటు లేకపోవడం వల్ల వేళ్ళు నొప్పులు పుట్టసాగాయి.

తోటి ఉద్యోగినులు బాగా పరిచయం అయ్యారు శైలజకి. అందరూ బస్వంత్ గురించి సలహాలు ఇచ్చారు, అతను ఆడవాళ్ళ విషయంలో మంచి వాడు కాడనీ, జాగ్రత్తగా ఉండాలనీ. ఇదివరకు శైలజ పోస్టులో ఉన్నామె

మేనేజర్ బాధ పడలేక రిజైన్‌చేసి వెళ్ళిపోయింది. మిగతా వాళ్ళలో చాలా మంది ఆ ఉద్యోగం పోతే బతకటం కష్టం. జస్వంత్ అంటే అసహ్యం ఉన్నా, ఉద్యోగాన్ని వదులుకోలేక పోతున్నారు.

"వాడు పట్టి బ్రూట్. ఒకసారి బర్తుడే అని ఇంటికి రమ్మంటే వెళ్ళాను. వాడుతప్ప ఎవరూలేరు. అసభ్యంగా ప్రవర్తించాడు. అసలు రంగు బయటపడింది. అప్పుడు ఇచ్చిన డోస్ ఇంకా పనిచేస్తోంది." చెప్పింది చెల్లిగా, నాజూగ్గా ఉండే పంథొమ్మిదేళ్ళ గుజరాతీ అమ్మాయి.

వారం రోజుల తరువాత ఆ గుజరాతీ అమ్మాయి రిజైన్ ఇచ్చేసింది.

చేరిన ఇరవై రోజులదాకా మర్యాదగానే ఉండేవాడు జస్వంత్. అందరూ చెప్పినంత నీచుడు కాదేమోననే భ్రమకలిగింది శైలజకి. గదిలోకి వెళ్ళగానే కూర్చోమనేవాడు మర్యాదగా. మేటర్ డిక్టేట్ చేసేవాడు. చూపులు మామూలుగా మేనేజర్ టైపిస్టుని చూసే విధంగా ఉండేవి.

కాని క్రమంగా జస్వంత్ ప్రవర్తనలో మార్పు కనబడుతూంది. చూపుల్లో ఇదివరకులేని ఆకలి కనపడుతూంది కొత్తగా. అతని మాటలూ, చేష్టలూ గగుర్పాటు కలిగించసాగాయి శైలజకి.

"మీరు ఈ లెటర్ చాలా నీట్‌గా టైప్ చేశారు. మీలాగే స్మార్టుగా ఉంది లెటర్ కూడా."

"భారతదేశంలో సింధీవాళ్ళను అందంలో మించినవాళ్ళు లేరనుకునే వాణ్ణి. కాని మిమ్మల్ని చూశాక ఆ అభిప్రాయం మార్చుకున్నాను. తెలుగు వాళ్ళలో ఇంత అందం చాలా అరుదు."

"వాటే సిటీ! నాలుగేళ్ళు కాలేజీలో చదివినా ఒక్క బాయ్‌ఫ్రెండ్ కూడా లేడా మీకు? మీరు చాలా టైం వృథా చేశారు."

జస్వంత్ మాటలు వింటుంటే ఆఫీస్‌బాయ్ చెప్పింది నిజమని పించింది శైలజకి. అందరూ చెప్పిన మాటల్లో నిజం కనిపించసాగింది.

ఆ గుజరాతీ అమ్మాయి రిజైన్ ఇచ్చి వెళ్ళిపోయినప్పటి నుంచీ శైలజకి మనస్థిమితం లేకుండా పోయింది. ఇప్పుడు ఆ గుజరాతీ అమ్మాయి చేసే పనిలో చాలాభాగం శైలజ మీద పడింది. జస్వంత్ చూపులు రోజు రోజుకీ కలవర పెడుతున్నాయి.

శైలజ తల్లి పక్షవాతంతో మంచంమీదనుంచి లేవలేని స్థితిలో ఉండకపోయినా, తండ్రి సంపాదన ఇంకో రెండువందలు పెరిగినా వెంటనే రిజైన్ ఇచ్చేసేది. కాని ఇంట్లో పరిస్థితులవల్ల ఈ ఉద్యోగం వదులుకోలేక పోతూంది.

సోమవారం ఉత్తరాలు ఎక్కువ వస్తాయి, మామూలు రోజుల్లో కన్నా. ఆరోజు సమాధానం వెళ్ళవలసిన ఉత్తరాలుకూడా ఎక్కువే ఉంటాయి. మిగిలిపోయిన ముఖ్యమయిన ఉత్తరాలు టైప్ చేస్తూంటే ఆఫీస్ బాయ్ వచ్చి చెప్పాడు, మేనేజర్ పిలుస్తున్నాడని. శైలజ వెళ్ళింది.

"దయచేసి ఈ డ్రాఫ్ట్ వెంటనే టైప్ చెయ్యండి. చాలా అర్జెంట్" కాగితాలు ముందు పడేశాడు.

చేతి గడియారం వంక చూసుకుంది శైలజ. అయిదూ పది. "ఇంకో పావుగంటలో అవదనుకుంటాను. రేపు ఫస్టవర్ లో చేస్తాను." అన్నది శైలజ.

"ముందరే చెప్పాను అర్జెంట్ అని. డైరెక్టర్ దగ్గరికి వెళ్ళాలి ఈ డ్రాఫ్ట్. కొంచెం ఆలస్యం అయినా ఫర్వాలేదు. దయచేసి ఇది పూర్తి చేసి వెళ్ళండి."

టేబిల్ మీద కాగితాలు అందుకుని మాట్లాడకుండా బయటికి వచ్చింది శైలజ. రోలర్ లో సగం టైప్ చేసివున్న కాగితంతీసి, కొత్త కాగితం ఎక్కించి చకచకా డ్రాఫ్ట్ టైప్ చేయసాగింది.

"టైమయింది. అంతా వెళ్ళిపోయారు. మీరు వెళ్ళటంలేదా?" అడిగాడు ఆఫీస్‌బాయ్, అయిదూ నలభైకి.

"అర్జెంట్ కాగితాలుట. వెంటనే కావాలంటున్నాడు" అన్నది శైలజ, టైప్ చేస్తున్న కాగితాలమీద నుంచి దృష్టి మరల్చకుండానే.

"ఎంతసేపు పడుతుంది?" అడిగాడు ఆఫీస్‌బాయ్.

"ఇంకో అరగంట పట్టవచ్చు" అన్నది శైలజ, మిగిలిపోయిన కాగితాలు లెక్కపెట్టి.

పావు గంట తరువాత బయటికి వచ్చాడు జస్వంత్. శైలజ, ఆఫీస్ బాయ్ తప్ప మిగతా అంతా వెళ్ళిపోయారు.

"ఇంకా నువ్వు వెళ్ళలేదేం?" అడిగాడు జస్వంత్, ఆఫీస్ బాయ్ వంక కళ్ళు చిట్లించి చూస్తూ.

"డిస్పాచ్ వర్క్ మిగిలిపోయింది" అన్నాడు, ఫ్రాంకింగ్ మెషిన్ ముందు కూర్చుని ఉన్న ఆఫీస్ బాయ్.

"రేపు చూడవచ్చు. వెళ్ళు" అన్నాడు జస్వంత్.

"అయిపోయింది. ఇంకో ఆయిదు నిమిషాలే" అన్నాడు ఆఫీస్ బాయ్.

జస్వంత్ విసురుగా లోపలికి వెళ్ళిపోయాడు.

శైలజ ఆరూ అయిదు కల్లా డ్రాఫ్ట్ పూర్తి చేసింది. అన్ని కాగితాలు దొంతరగా పెట్టి మేనేజర్ గదిలోకి వెళ్ళింది.

"వెరీగుడ్! లేటయిందనుకుంటాను మీకు" అన్నాడు కాగితాలు చూసి.

"ఫర్వాలేదు" అన్నది.

"మీకు అభ్యంతరం లేకపోతే ఇంటిదగ్గర డ్రాప్ చేస్తాను."

"నో, థ్యాంక్స్."

బయటికి వచ్చేసింది.

"నే నేమీ అనుకునేవాణ్ణి కాను. కారు మీ ఇంటి వైపే వెళుతుంది ఇప్పుడు." జస్వంత్ వెనకే బయటకి వచ్చాడు.

"నో. వెరీ మెనీ థ్యాంక్స్."

ఆఫీస్ బాయ్ లేచి నిలబడి అన్నాడు: "ఫర్వాలేదు. రండి, వెళదాం. త్వరగా ఇంటికి వెళితే పంపు రిపేరు చేయవచ్చు."

శైలజకి అర్థం కాలేదు.

"శైలజగారి ఇంట్లో పంపు చెడిపోయింది. నాకు రిపేరు చేయటం వచ్చు. ఈ వేళ కూడా రమ్మన్నారు." చెప్పాడు జస్వంత్‌కి.

"అవును మా ఇంట్లో చెడిపోయింది." కృతజ్ఞతగా చూసింది శైలజ, ఆఫీస్ బాయ్ వంక. జస్వంత్ మొహం కందగడ్డలా అయింది.

మర్నాడు శైలజ ఉత్తరాలు టైప్ చేస్తుంటే, ఆఫీస్ బాయ్ వచ్చి చెప్పాడు, జస్వంత్ పిలుస్తున్నాడని. టైప్ చేస్తున్న ఉత్తరం పూర్తిచేసి, మేనేజర్ గదిలోకి వెళ్ళింది శైలజ.

"మీ కెవరయినా పోలీసు ఇన్‌స్పెక్టర్ తెలుసా?" అడిగాడు జస్వంత్.

"తెలియదు. ఎందుకు?" అడిగింది శైలజ ఆశ్చర్యంగా. టేబిల్ మీద ఉన్న రిసీవర్ వంక చేత్తో చూపించాడు.

"ఎవరో పోలీస్ ఇన్‌స్పెక్టర్ మీతో మాట్లాడాలిట."

రిసీవర్ అందుకుని "శైలజ స్పీకింగ్" అన్నది.

రెండు నిమిషాలు మౌనంగా అవతలి వాళ్ళు చెప్పేది వింటూండి పోయింది. ఆల్‌రైట్. వస్తున్నాను" అని రిసీవర్ పెట్టేసింది.

"ఏమయింది?" అడిగాడు జస్వంత్, ఆందోళనఉన్నశైలజ మొహం వంక చూస్తూ.

కొన్ని క్షణాలు సందేహిస్తూ ఉండిపోయింది చెప్పాలా, వద్దా అని ఆలోచిస్తూ.

"ఏదయినా పర్సనల్ మేటరా?" అడిగాడు.

"అవును" అని కొన్ని క్షణాలు తటపటాయించి, "మా అన్నయ్య జైల్లో ఉన్నాడు" అన్నది.

అదిరిపడి చూశాడు, శైలజ చెప్పింది నమ్మలేనట్లుగా.

"నేను వెంటనే వెళ్ళాలి. బహుశా రేపు రాను. ఎల్లుండి రాగానే లీవ్‌లెటర్ రాసి ఇస్తాను" అన్నది శైలజ.

"మీరు మరోలా అనుకోకపోతే, మీ అన్నయ్యని ఎందుకు జైల్లో పెట్టారో అడగవచ్చా?" అడిగాడు జస్వంత్.

జస్వంత్ వంక చూసింది శైలజ.

"మా అన్నయ్య నిజానికి చాలా మంచివాడు. కాని కొంచెం దురుసుతనం ఎక్కువ. దానికి తోడు మా అమ్మావాళ్ళూ మొదటినుంచీ వాడి విషయం ఆట్టే పట్టించుకోలేదు. రోజూ ఆఫీసుకు వచ్చేటప్పుడు నా వెనకాలే వచ్చి గొడవ చేస్తున్నారు ఇద్దరు. ఆ సంగతి అన్నయ్యకి తెలిసింది ఎలాగో. నలుగుర్ని కూడా తీసుకువెళ్ళి గంటక్రితం ఆ ఇద్దరినీ కొట్టాడు. పోలీసులు పట్టుకున్నారు" అన్నది దిగులుగా.

కళ్ళప్పగించి చూస్తూండిపోయాడు జస్వంత్ ఆశ్చర్యంగా.

మూడో రోజు వచ్చి జాయిన్ అయింది శైలజ.

"ఏమయింది? మీ అన్నయ్యని విడిచి పెట్టారా?" అడిగాడు జస్వంత్ ఆత్రంగా.

"లేదు. వాళ్ళిద్దరిలో ఒకడి చేయి విరిగిపోయింది. కనీసం మూడు నెలలయినా జైలు పడవచ్చుట." చెప్పింది బాధగా.

పదిహేను రోజుల తరువాత వందరూపాయలు అడ్వాన్సుకి అప్లికేషన్ పెట్టింది శైలజ.

"దేనికీ అడ్వాన్సు?" అడిగాడు జస్వంత్.

"కోర్టులో కట్టాలి" అన్నది పొడిగా.

"దేనికి? మీ అన్నయ్యని వదిలేశారని చెప్పారుగా?"

"మళ్ళీ గోలయింది ఇంకొకడితో, వందరూపాయలు జరిమానా వేశారు" అన్నది తల వంచుకుని.

ఆఫీసులో అందరూ శైలజపట్ల జస్వంత్ మార్పు గమనించారు. ఇదివరకున్న వెకిలితనం లేదు. మర్యాదగా చూస్తున్నాడు శైలజని.

* * *

బాజాలు గట్టిగా మోగగానే అందరితోపాటు తనూ అక్షింతలు విసిరాడు జస్వంత్, వధూవరుల మీదికి.

"పెళ్ళి అయిపోయినట్లేనా?" అడిగాడు పక్కవాళ్ళని.

"పెళ్ళయితే పూర్తికాలేదు కాని, పెళ్ళిలో ముఖ్య భాగమయిపోయింది" చెప్పారు సూటులో ఉన్న జస్వంత్ వంక చూస్తూ.

జస్వంత్ లేచి కల్యాణ మంటపం దగ్గరికి వెళ్ళాడు, అందరినీ తప్పించుకుంటూ.

"హలో, ఎలా ఉంది పెళ్ళి? విసుగు పుడుతోందా?" అడిగింది మధుపర్కాలలో ఉన్న శైలజ నవ్వుతూ.

"నో. చాలా ఇంటరెస్టింగ్‌గా ఉంది."

"బైదిబై.... ఈయన.... పరిచయం చెయ్యక్కర్లేదు. శుభలేఖలో చదివారుగా?" అన్నది నవ్వి.

శైలజ భర్త చెయ్యి చాపాడు. "మీ గురించి శైలజ చెప్పింది. వచ్చినందుకు చాలా సంతోషం" అన్నాడు.

ముత్తయిదువులు వచ్చారు శైలజని పీటల మీద నుంచి తీసుకువెళ్ళడానికి.

"భోజనానికి మీరు తప్పకుండా ఉండాలి ఇక్కడే. లేకపోతే నాకు కోపం వస్తుంది" అన్నది శైలజ.

"తప్పకుండా ఉంటాను. ఇంట్లో రానని చెప్పేవచ్చాను" అన్నాడు జస్వంత్.

"దటీజ్ వెరీ కైండ్ ఆఫ్ యు" అన్నది శైలజ.

"మీ అన్నయ్య ఎక్కడ?" అడిగాడు జస్వంత్ చుట్టూ చూస్తూ.

చిన్నగా నవ్వింది శైలజ.

"నాకు అన్నయ్య లేడు."

"మరి....అతను మీ కజినా?"

ముత్తయిదువులు శైలజని లోపలికి తీసుకువెళ్ళిపోయారు.

"భోజనానికి తప్పకుండా ఉండండి" అన్నది శైలజ వెళుతూ.

శైలజకు అన్నయ్యలేడా? జస్వంత్‌కు అర్థంకాలేదు. అయోమయంగా ఉంది.

"శైలజ అన్నయ్యలేడా?" అడిగాడు శైలజ భర్తని.

"లేదు. మీకా అనుమానం ఎందుకు వచ్చింది?"

"శైలజకి అన్నయ్య ఉన్నాడని నాతో చెప్పింది. కాని మంచివాడు కాడుట. పరమ దుర్మార్గుడు. జైలుకుకూడా వెళ్ళాడుట."

చిన్నగా నవ్వాడు శైలజ భర్త.

"బహుశా మీకు తెలియకుండా దాచిపెట్టి ఉండవచ్చు ఈ సంగతి."

"నో, నో! శైలజకి అన్నయ్యే కాదు, తమ్ముడు కూడా లేడు. శైలజ తెలివిగలది. వయసులో ఉన్న ఆడపిల్లలు బయటికి వెళితే ఉండే ఇబ్బందులు మీకు బాగా తెలిసి ఉండాలి. శైలజ తనని ఎవరూ ఇబ్బంది పెట్టకుండా ఉండేందుకు అలా అబద్ధం చెప్పి, లేని అన్నయ్యని సృష్టించింది. వాళ్ళ అన్నయ్య భయంతో ఎవరూ శైలజని ఇబ్బంది పెట్టేవాళ్ళు కారు. శైలజని ఏమయినా అంటే తమకేమయినా అవుతుందేమోననే భయంతో అందరూ మర్యాదగా ఉండేవారు."

"దటీజ్ ఎ బెటర్ అయిడియా!"

జస్వంత్ మొహంలో రంగులు మారటం గమనించి చిన్నగా నవ్వుకున్నాడు శైలజ భర్త.

చేతి గడియారం వంక చూసుకున్నాడు జస్వంత్. "విష్ యు గుడ్ లక్. ఇక వెళతాను" అన్నాడు.

"అదేమిటి? భోజనానికి ఉండరా?" అడిగాడు శైలజ భర్త.

"నో. థాంక్స్. కొంచెం పని ఉంది" అన్నాడు.

"ఆల్‌రైట్. మీ ఇష్టం. బైదిబై శైలజ ఇంక ఉద్యోగం చేయదు. రిజైన్ ఇచ్చేస్తుంది."

వెనకనుంచి శైలజ భర్త నవ్వు విన్నాడు జస్వంత్, వెడుతూ.

(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 7-7-1971 సంచిక)